ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 15.12.2025 సమయం : 1810 గంటలు

ముఖ్యాంశాలు

1. ఈ రోజు లోక్ సభలో ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లును సంయుక్త పార్లమెంట్ కమిటీ - JPC పరిశీలిస్తుంది.

2. రాష్ట్రంలో ఎల్లుండి జరగనున్న మూడో విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం ఈ సాయంత్రం 5 గంటలకు ముగిసింది.

3. కొత్తగా ఎన్నికైన సర్పంచుల కోసం బీఆర్ఎస్ ప్రత్యేక న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారక రామారావు చెప్పారు.

4. రాష్ట్రంలో రెండు రోజుల పాటు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుండి 4 డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

-----------------------------

**బిల్లు**

ఈరోజు లోక్‌సభలో ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, 2025ను తదుపరి పరిశీలన కోసం పార్లమెంట్ సంయుక్త కమిటీకి పంపించారు. ఈ మధ్యాహ్నం రెండో వాయిదా అనంతరం లోక్‌సభ సమావేశమైనప్పుడు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అయితే, ప్రతిపక్ష సభ్యులు బిల్లును వ్యతిరేకించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ, బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పలువురు ఎంపీలు ఈ బిల్లుపై విస్తృత సంప్రదింపులు జరపాలని నొక్కి చెప్పారని తెలిపారు.

వారి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని, విస్తృత సంప్రదింపుల కోసం బిల్లును జేపీసీకి పంపాలని ప్రభుత్వం ప్రతిపాదించిందని రిజుజు చెప్పారు.

**ఎస్ఎస్డీ**

-----------------------------

**ప్రచారం**

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల చివరి విడత ప్రచారం ఈ సాయంత్రంతో ముగిసింది. దీంతో, ప్రచార రథాలు కూడళ్లలో లేకుండా చూడటంతో పాటు.. మైకులు, జెండాలను అధికారులు తొలగిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి నేపథ్యంలో చివరి విడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో ఉన్న మద్యం దుకాణాలను కూడా ఈ సాయంత్రం ఐదు గంటలకు మూసివేశారు. ఎల్లుండి సాయంత్రం 5గంటల తర్వాత మద్యం దుకాణాలను తెరుస్తారు.

**జీఎస్**

---------------------------

**ఎల్లుండి పోలింగ్**

రాష్ట్రంలో చివరి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ ఎల్లుండి జరగనుంది. ఈ విడతలో జరగనున్న ఎన్నికల్లో మొత్తం 4వేల 158 సర్పంచ్ స్థానాల్లో.. 394 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఇక పలు కారణాల వల్ల 11 గ్రామాలు ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. దీంతో మిగిలిన 3వేల 752 స్థానాలకు మొత్తం 12వేల 640 మంది అభ్యర్థులు సర్పంచ్ లుగా పోటీ చేస్తున్నారు. మూడో విడతలో మొత్తం 36వేల 434 వార్డు స్థానాల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. కానీ ఇందులో 7వేల 916 స్థానాల్లో వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో మిగిలిన 28వేల 406 వార్డు స్థానాలకు 75వేల 283 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. కాగా, 112 వార్డులకు వివిధ కారణాల వల్ల ఎన్నికలు జరగడం లేదు.

**జీఎస్**

---------------------

**బాలసుబ్రహ్మణ్యం**

హైదరాబాద్ లోని రవీంద్రభారతి ప్రాంగణంలో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఈ రోజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి శ్రీధర్‌బాబు, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు సహా పలువురు హాజరయ్యారు. విగ్రహావిష్కరణలో భాగంగా రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**డెస్క్**

-----------------------

**కేటీఆర్**

రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులను ఇబ్బంది పెట్టాలని చూస్తే ఊరుకోబోమని, వారి రక్షణ కోసం ప్రతి జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ తరఫున ప్రత్యేక న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారక రామారావు ప్రకటించారు. సిరిసిల్ల జిల్లాలో రెండు విడతల్లో గెలుపొందిన బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన బిఆర్ఎస్ మద్దతుదారులు కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు భయపడవద్దని అన్నారు.

**బైట్ తారాక రామారావు**

**పీటీసీ - రాజన్న సిరిసిల్ల**

----------------------------

**జేఈఈ**

జేఈఈ అడ్వాన్స్‌డ్ 2026 ప్రవేశ పరీక్షకు సంబంధించి సిలబస్‌ను ఐఐటీ రూర్కీ నిన్న విడుదల చేసింది. వచ్చే ఏడాది మే 17న జేఈఈ అడ్వాన్స్ పరీక్ష జరిపేందుకు ఇప్పటికే షెడ్యూలు ఖరారైంది. ఈ నెల 5న ఈ పరీక్షకు సంబంధించి వెబ్‌సైట్‌ను ఐఐటీ రూర్కీ

అధికారులు అందుబాటులోకి తెచ్చారు. సిలబస్‌లో ఎలాంటి మార్పు లేదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

**డెస్క్**

------------------------

**హైకోర్టు**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో డివిజన్ల పెంపును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. డివిజన్ల పునర్విభజనలో అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్ పేర్కొన్నారు. తన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ కోరారు. అనంతరం పిటిషన్‌పై విచారణను హైకోర్టు రేపటికి వాయిదా వేసింది.

**డెస్క్**

-------------------------------

**తెలంగాణ జన సమితి**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ లో కలిపిన భద్రాచలం మండలంలోని ఐదు గిరిజన గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలిపేందుకు రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ చూపాలని తెలంగాణ జన సమితీ ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్ రావు కోరారు. కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, గుండాల, పురుషోత్తమ పట్నం, ఎటపాక గ్రామాల ప్రజలకు భద్రాచలంతో సంబంధాలు తెగిపోవడం వల్ల ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ప్రస్తావించారు.

**పీఎస్**

-----------------------

**పటేల్ వర్ధంతి**

దేశ మొదటి ఉప ప్రధాన మంత్రి, హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి కార్యక్రమాలు రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. యువజన సంఘాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

---------------------------

**పెద్దపల్లి జిల్లా**

పెద్దపల్లి జిల్లాలోని న్యాయ సేవా సంస్థ అందించే సేవలను సీనియర్ సిటిజన్ లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. ఈ రోజు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ను ప్రారంభించారు. ప్రతి సోమవారం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో ప్యానల్ న్యాయవాదులు అందుబాటులో ఉంటారని, పిల్లలతో సమస్యలు ఎదుర్కొంటున్న వృద్ధ తల్లిదండ్రులు ఇక్కడ తమ ఫిర్యాదులు నమోదు చేయవచ్చని తెలిపారు.

**పీటీసీ – పెద్దపల్లి**

------------------------

**వేములవాడ పుణ్యక్షేత్రం**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ పుణ్యక్షేత్రానికి గత కొద్ది రోజులుగా భక్తుల తాకిడి పెరిగింది. మేడారం సమ్మక్క జాతర సమీపిస్తున్న నేపథ్యంలో ముందుగా వేములవాడ స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో వివిధ ప్రాంతాల నుండి తరలివస్తున్న భక్తులు భీమేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకొని పూజలు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఈవో రమాదేవి అధికారులను ఆదేశించారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

-------------------------

**జోగులాంబ గద్వాల జిల్లా**

గ్రామపంచాయతీ మూడవ విడత ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది కేటాయింపు కొరకు మూడవ ర్యాండమైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, పేర్కొన్నారు. పోలింగ్ జరగనున్న 638 పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించామన్నారు.

**పీటీసీ - జోగులాంబ గద్వాల**

-----------------------

**వాతావరణం**

గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో చలి గాలులు వీచినట్లు ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఈరోజు, రేపు రాష్ట్రమంతటా కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.

**పీఎస్**

-------------------------

**యాదాద్రి భువనగిరి జిల్లా**

యాదాద్రి భువనగిరి జిల్లాలో మూడవ విడత పంచాయతీ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ పొరపాట్లకు తావు లేకుండా చూడాలని సూచించారు.

**పీటీసీ - యాదాద్రి భువనగిరి**

----------------------------

**ఆసిఫాబాద్ జిల్లా**

అసిఫాబాద్ జిల్లాలో ఎల్లుండి పంచాయతీ ఎన్నికలు జరగనున్న గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ సంస్థలకు సాధారణ సెలవు ప్రకటించినట్లు జిల్లా

కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కోసం కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు రేపు కూడా సాధారణ సెలవు ప్రకటించామన్నారు. ప్రైవేట్ పరిశ్రమల్లో, సంస్థల్లో పని చేస్తున్న వారికి పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఆదేశించారు.

**పిటిసి - ఆసిఫాబాద్**

-----------------------------

**జనగామ జిల్లా**

జనగామ జిల్లాలో ఇప్పటివరకు జరిగిన మొదటి, రెండవ విడత ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లే ఎల్లుండి జరిగే మూడవ విడత ఎన్నికల్లో అధికారులు సమన్వయంతో పని చేయాలనీ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్  ఆదేశించారు. మరోవైపు దేవరుప్పుల మండలంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ ఈ రోజు పరిశీలించారు.

**పీటీసీ – జనగామ**

-----------------------------

**మహేష్**

పంచాయతీ ఎన్నికల రెండో విడత ఫలితాలు రాష్ట్ర గ్రామీణ రాజకీయాల్లో స్పష్టమైన మార్పునకు సంకేతమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.  ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ఓటర్లు ప్రభుత్వ పాలనపై వ్యక్తం చేసిన విశ్వాసానికి  ప్రతిబింబంగా ఈ ఫలితాలు నిలిచాయన్నారు. ప్రజల ఆశయాలకు అద్దం పట్టేలా వచ్చిన ఈ తీర్పు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పట్ల గ్రామీణ ప్రజల్లో ఏర్పడిన సంతృప్తిని మరోసారి రుజువు చేసిందని ఆయన అభిప్రాయపడ్డారు.

**డెస్క్**

---------------------

**అవార్డు**

తెలంగాణ రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మక జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డు (ఎన్ఈసీఏ) లభించింది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన ఇంధన సామర్థ్యం సంస్థ (బీఈఈ) ఏటా ఇచ్చే జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డుల్లో 2025 సంవత్సరానికి తెలంగాణకు ద్వితీయ పురస్కారం దక్కింది.

**డెస్క్**

------------------------------